క్లుప్తంగా

నేడు నీటి సరఫరా నిలిపివేత

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి సోమవారం మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదండాపురం ప్లాంట్ వద్ద గ్యాలరీ లీకేజీలు, ఇతర పనుల నిర్వహణ నిమిత్తం నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

అంగడిపేటలో మెగా వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద హిమాలయ ఆస్పత్రి వారి సౌజన్యంతో హెల్త్‌కేర్ డయాగ్నొస్టిక్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.అనంతరం వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందించడంపై చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'చలో గోవా' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్ : గోవాలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 7న నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమ రాజకీయ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మకు పంపించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ బీసీలపై సానుకుల దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, మహేష్‌కుమార్, హరి, నవీన్, ఆదిత్య, శివశంకర్, నాగరాజు, చంటి, అంజి, రాజు, లోకేష్, అఖిల్, శివ, సాయి తదితరులున్నారు.

యువజన విభాగం మండల అధ్యక్షుడిగా మహేష్



త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన మెరుగు మహేష్ త్రిపురారం మండల మున్నూరు కాపు సంఘం యువత అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా మెరుగు మహేష్ మాట్లాడారు. మండలంలో మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువత తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమయ్య

త్రిపురారం : మండలంలోని పెద్దదేవుల పల్లి గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య పంపిణీ చేశారు. ఆ గ్రామానికి చెందిన అల్లం మంగమ్మకు రూ.54వేలు, గుండెబోయిన యాదగిరికి రూ.25వేలు, మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబటి రాము, నగేష్ యాదవ్, సంతోష్ కుమార్,గణేష్, ఖలీల్, నాగేందర్, సైదులు, సూరయ్య, అంబటి కృష్ణ, తరుణ్, దుర్గయ్య పాల్గొన్నారు.

నాలుగు గోవులు పట్టివేత

నల్లగొండ : అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని మర్రిగూడ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మర్రిగూడ మండలంలోని కొండూరు సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో నాలుగు గోవులను మల్లేపల్లి సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని కోబరాలకు తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, గోవులను గోశాలకు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ స్టేషన్

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- ఇబ్బందులు పడుతున్న పోలీసులు
- త్వరలో పాత కోర్టు భవనంలోకి..


స్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన పోలీస్ స్టేషన్ భవనం


పాత కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సురేష్

నిడమనూరు : నిడమనూరు పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే భవనం స్లాబ్ కురుస్తుంది. కంప్యూటర్లు, స్టేషన్ సామగ్రి, రికార్డులను భద్రపరిచేందుకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు వర్షాల నేపథ్యంలో ఎప్పుడైన కూలే ప్రమాదం ఉందని, స్థానిక ఎస్ఐ ఉప్పు నరేశ్ పోలీస్‌భవనం పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించారు. అంతేగాక పాత కోర్టు భవనం ఖాళీగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు కూడా వచ్చాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌ను పాత కోర్టు భవనంలోకి మార్చడానికి చర్యలు తీసుకుంటున్నారు.

1994లో నిర్మాణం

ప్రస్తుత పోలీస్‌స్టేషన్ భవనం 1994లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జానారెడ్డి ప్రారంభించారు. మూడు దశాబ్దాలకే స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరింది. వాచ్ టవర్, మొదటి అంతస్తులో రెండు గదులు వంటి అదనపు నిర్మాణాలు చేపట్టారు. మావోయిస్టుల ప్రాభల్యంతో పోలీసు బలగాల బలోపేతానికి నిడమనూరు, త్రిపురారం పోలీస్‌స్టేషన్లు నిడమనూరు భవనం నుంచే కార్యకలపాలు నిర్వహించేవారు.

కోర్టు భవనం పరిశీలన..

వర్షాల నేపథ్యంలో పాత కోర్టు భవనంలోకి మార్చనున్నారు. నెల రోజుల క్రితం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్వహించారు. జూన్ 2న నూతన కోర్టు భవనాలను ప్రారంభించారు. దీంతో పాత కోర్టు భవనం ఖాళీగా ఉంది. ఈ భవనం పోలీస్ స్టేషన్ కార్యాకలాపాలకు వీలుగా ఉంటుందని భావించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావడంతో పోలీస్ స్టేషన్ ఆ పాత కోర్టు భవనంలోకి మార్చనున్నారు. ఈ నేపథ్యంలో హాలియా సీఐ సతీశ్‌రెడ్డి పరిశీలించి ఉన్నతాధికారులకు వివరించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నిడమనూరు పోలీస్ స్టేషన్ భవనం దృష్టి జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జిల్లా అధికారులు, స్థానికు పోలీస్ అధికారులతో పాటు, తహసీల్దార్ నివేదిక , కలెక్టర్ అనుమతితో భవనం మార్చేందుకు చర్యలు చేపట్టాం. వర్షాల నేపథ్యంలో కంప్యూటర్లు, సెట్ కాన్ఫరెన్స్ వంటి సాంకేతిక పరికరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి మార్చుతున్నాం.

– ఎస్ఐ ఉప్పు సరేష్

వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ప్రధాన రోడ్లతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని సాగర్ రోడ్డులో ఆదివారం చేపట్టిన పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌ను ద్విచక్రవాహనంపై తిరిగి పర్యవేక్షించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కొంత సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రధాన రోడ్లతో పాటు వార్డుల్లోని వీధులన్నీ శుభ్రంగా ఉండాలన్నారు. అదే విధంగా వార్డుల్లో చాలా వరకు డ్రైయినేజీలు పూడిపోయి మురుగు అంతా రోడ్లపైకి వచ్చి చేరుతుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం వేయకుండా మున్సిపాలిటీ వాహనాలు రాగానే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. పరిసరాలు అన్ని శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని వందేమాతరం ఫౌండేషన్ సభ్యుడు, ఆయుష్ యోగా శిక్షకుడు బేతం రామాంజిరెడ్డి అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 28 వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మాజీ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రోజురోజుకు క్షీణించిపోతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మీ ఇంటితో పాటు మీ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా 150మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానికులు భానోత్ ప్రసాద్, చందా ప్రసాద్, ఓరుగంటి రాజ్యలక్ష్మి, నూకల లక్ష్మి, మట్టపల్లి రజిత, ఓరుగంటి హైమా రాణి, సావిత్రి, జానకి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

పెద్దవూర : యువత మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆదివారం నాగార్జునసాగర్‌లో విచిత్ర వేషధారణలో ఓ ఉపాధ్యాయుడు కరపత్రాలతో అవగాహన కల్పించారు. ఆయన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాచకొండ ప్రభాకర్ డ్రగ్స్ రహిత సమాజ స్థాపన ధ్యేయంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రంలో మున్సిపాలిటీల్లో కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం తెలంగాణ ఆంధ్ర సరిహద్దులోగల కొత్త బ్రిడ్జిపై బ్యానర్‌తో మత్తు పదార్థాలకు యువకులు బానిసలు కావద్దని, మత్తు బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితువు పలికారు. జాతరలు, ఉత్సవాలు, పర్యాటక ప్రదేశాలు వారంతాపు సంతలలో , ప్రజలు గుంపులుగా ఉన్న చోట ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్యే బాలునాయక్


చింతపల్లి సాయినాథుడి దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి

దేవరకొండ : పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో రూ.1.35 కోట్లతో చేపటనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పబ్లిక్ హెల్త్ ఎస్ఎఈ వెంకటేశ్వర్లు, మనోహర, కమిషనర్ సుదర్శన్, నాయిని మాధవ రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, పల్లా నర్సింహారెడ్డి, ఎంఏ సిరాజ్ ఖాన్, వేణుధర్‌రెడ్డి, రహత్‌అలీ, వెంకటయ్యగౌడ్, యూనూస్, హరికృష్ణ ఉన్నారు.

మంత్రికి ఘనస్వాగతం

కొండమల్లేపల్లి : దేవరకొండ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు మొదటిసారిగా నియోజకవర్గానికి వచ్చిన నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు కొండమల్లేపల్లి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక చౌరస్తాలో మండల పార్టీ అధ్యక్షుడు ఊట్కూరి వేమన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు మంత్రిని శాలువాతో సన్మానించారు. మంత్రి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎక్కువ సీట్లు వచ్చేలా కృషిచేయాలని సూచించారు. అనంతరం పార్టీ కార్యక్రమాలలో పాల్గొనుటకు దేవరకొండకు బయలుదేరి వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో మాజీ సర్పంచ్‌లు కుంభం శ్రీనివాస్ గౌడ్, రవినాయక్, కొట్ల జగదీష్, శ్రీరాములు, పిల్లి రామస్వామి, నాగరాజు ,లాలునాయక్, నజీర్ మౌలానా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయి దేవాలయంలో మంత్రి పూజలు


మంత్రిని శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో ఆదివారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రత్యేక పూజ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి దేవరకొండ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్తూ మార్గం మధ్యలో మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడిని దర్శించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సాయి దేవాలయానికి వస్తున్న విషయం తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాలకు గ్రామాల చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై పూలమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువతకు అబ్దుల్ కలాం ఆదర్శ ప్రాయుడు


అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయుడని సామాజిక వేత్త జాడి రాజు, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మేరెడ్డి రాంచంద్రారెడ్డి గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు. ప్రపంచ మేధావిగా, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా అబ్దుల్ కలాం పేరొందినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేగొండి మురళీయాదవ్, జయరాజు, నాగేశ్వర్‌రావు, వెంకన్న, శ్రీను, దుర్గయ్య, అనిల్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని బీజేపీ జిల్లా నాయకులు గుండాల అంజయ్య అన్నారు. ఆదివారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించిన మండల పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో అత్యధిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వలసాని రామలింగం, జిల్లా కౌన్సిల్ మెంబర్ వంగాల ప్రతాపరెడ్డి, వెంకట్‌రెడ్డి, అంతిరెడ్డి, గోవిందు, శ్రీను, ఆంజనేయులు, తిరుపతి తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరీని ప్రకటించాలని బీసీ యువజన విభాగం రాష్ట్ర నేత తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో మహాత్మాజ్యోతిరావ్‌పూలే భవనంలో నిర్వమించిన బీసీ యువజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రాజకీయం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందించినప్పటికీ దానిపై కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు దాసరాజు జయరాజు, మురళి యాదవ్, గంగాధర్, ఉపేందర్ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. పలు చోట్ల సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శివ, గణేష్, మహేష్, రామలింగం, అనిల్, చరణ్, మునేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దగ్ధం


కాలిపోయిన బైక్

పెద్దఅడిశర్లపల్లి : ప్రయాణిస్తున్న బైక్‌లో మంటలు చెలరేగాయి. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన రాపర్తి రాఘవేందర్ ఆదివారం మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో దుగ్యాల మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే బైక్‌లో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి కృషి



ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి నల్లగొండలో స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సంఘం ద్వితీయ వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాటలోకి వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విశ్రాంత ఉద్యోగులు బలపరచాలని కోరారు. యూనియన్ రాష్ట్ర నాయకుడు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల యాదయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో శ్రావణమాస పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ : పట్టణంలోని రామగిరిలో గల ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం మొదటి శ్రావణమాసం సందర్భంగా అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవ కలశారాధన, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ఎలిజాల అంజయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, నాగరాజు, మునాస వెంకన్న, మణిదీప్, కృష్ణయ్య, రాము, వినయ్‌కుమార్, ప్రసన్న, చంద్రకళ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ గోడలపై మొక్కలు



అలీనగర్ వద్ద ఫ్లైఓవర్ గోడలపై మొలిచిన మొక్కలు

హాలియా : అనుముల మండలంలోని అలీనగర్ వద్ద ఉన్న 167జాతీయ రహదారి ఫ్లై ఓవర్ గోడలకు రావి, వేప, తీగ జాతి మొక్కలు మొలుస్తున్నాయి. భారీగా ఉండే వాటిలో రావి, వేప చెట్లను మనం పలు చోట్ల సూస్తుంటాం. అట్లాంటి చెట్ల మొక్కలు ఫ్లై ఓవర్ గోడలకు మొలవడం కలవరానికి గురి చేస్తుంది. ఈ మొక్కలు కాస్తా చెట్లుగా పెరిగి పెద్దవి అయితే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫ్లైఓవర్ గోడలకు మొక్కలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మొక్కలు ఏపుగా పెరగకముందే వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మోదీ ప్రసంగాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని వీటీ కాలనీ 108వ బూత్ వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు తిలకించారు. ప్రతి ఆదివారం ఉదయం దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని నల్లగొండలో బీజేపీ నాయకులు బూత్ కార్యకర్తలతో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, మిరియాల సత్యనారాయణ, గుర్రం వెంకన్న, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని డాక్టర్స్ కాలనీలో జరిగిన పట్టణ రైతు సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, కుంభం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నకిరేకంటి జానయ్య, కోశాధికారిగా బోదనపు వెంకటరెడ్డి, కమిటీ సభ్యులుగా బట్టు నిర్మల, సత్తయ్య, రామకృష్ణారెడ్డి, విష్ణుమూర్తి, పాక మల్లయ్య, బుచ్చిరెడ్డి, విజయలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ ఆసం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, కుంభం లక్ష్మమ్మ, ప్రసన్న, సరిత, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో భగవద్గీత సత్సంగం

హుజూర్‌నగర్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రంలో ఆదివారం భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం ప్రవచన వక్త, భగవద్గీత ప్రచారకుడు ప్రభూజి హషికేశదాస్ పాల్గొని భగవద్గీత రెండవ అధ్యాయంపై ప్రసంగించారు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందే అద్భుతమైన మార్గాన్ని భగవద్గీత మనకి ప్రసాదిస్తుందన్నారు. లౌకికమైన చింత, భ్రాంతి, దుఃఖముల నుంచి అలౌకికమైన చింతన, సత్యం సుఖం వైపుకి భగవద్గీత జ్ఞానం మనల్ని తీసుకెళ్తుందని అందరూ తెలుసుకోవాలన్నారు. ఆత్మజ్ఞానంతో జీవితంలో సుఖసంతోషాలు సులువుగా వస్తాయన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య భజన మండలి వారి భజనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రచారకులు హషికేశదాస్, ప్రసాదం పంపిణీకి సహకరించిన కుక్కడపు సైదులును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మట్టపల్లి శ్రీమన్నారాయణ, ఓరుగంటి నాగేశ్వరరావు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, మట్టపల్లి వెంకటనారాయణ, కేశగాని నాగేశ్వరరావు, రమేష్‌ప్రభు, మట్టపల్లి లక్ష్మీనారాయణ, వీరవల్లి కొండలు, భొగ్గవరపు రాధ ఉన్నారు.